సాక్షి చిత్తూరు

శనివారం । 10 । జూన్ । 2023



సాకులు చెప్పకండి

సకాలంలో పనులు చేయండి.. సాకులు చెప్పకండి అంటూ కలెక్టర్ షణ్మోహన్ అధికారులను హెచ్చరించారు. - 8లో



ఆగని ఏనుగుల దాడులు

పులిచెర్ల మండలంలో 4 రోజులుగా మామిడి తోటలు ధ్వంసం చేసిన ఏనుగులు, తాజాగా కొబ్బరి చెట్లును నేలకూల్చాయి. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	27
తిరుపతి	38	27
తిరుమల	34	22
గూడూరు	42	29
నగరి	40	28

న్యూస్‌రీల్

జేవీకే కిట్లు సిద్ధం చేయండి



బంగారుపాళెంలో జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న డీఈఓ

బంగారుపాళెం: పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని జేవీకే స్టాక్ పాయింట్‌ను శుక్రవారం డీఈఓ తనిఖీ చేశారు. యూనిఫామ్, షూ, బెల్ట్, బ్యాగుల కొలతలు, నాణ్యత, పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల వివరాలను ఎంఈఓ నాగేశ్వర రావును అడిగి తెలుసుకున్నారు. మండలంలో 5,900 మంది విద్యార్థులకు కిట్లు అందాయన్నారు. వాటిని ఆయా పాఠశాలలకు అందజేస్తున్నట్లు డీఈఓకు వివరించారు. ఇప్పటి వరకు 40 శాతం పంపిణీ పూర్తయిందని, మిగిలిన వాటిని త్వరగా పాఠశాలలకు చేరవేస్తామన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

15న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకలను ఈ నెల 15న మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో హుండీ కానుకలు లెక్కించనున్నట్లు వెల్లడించారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

యాదమరి: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని చిత్తూరు సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, తదితర శాఖల అధికారులకు సమావేశం నిర్వహించారు. అందులో సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలబాలికలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. అలా ఎవరైనా పెట్టుకుంటే వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా రూ.50 వేలు జరిమానా విధిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు బాలకార్మికులు ఉన్నారా లేదా అని తనిఖీలు చేసి గుర్తించాలని చెప్పారు. బాల కార్మికులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఎంపీడీఓ శివరాజ్, ఎంఈఓ రుక్మిణీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్సీ



శ్రీకాకుళం ఎమ్మెల్సీ దంపతులతో ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని శ్రీకాకుళం ఎమ్మెల్సీ కల్యాణి దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం స్వామివారి దర్శనార్థం ఆమె కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పల్లెకు పట్టాభిషేకం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెకు పట్టం కట్టింది. పాలనలో పారదర్శకత పెరిగింది. అభివృద్ధి, సంక్షేమం రెండూ క్షేత్రస్థాయికి చేరాయి. గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యత వచ్చింది. పంచాయతీల్లో రోడ్లు, నూతన ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు పల్లె సీమలకు మణిహారాలుగా మారాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల ముంగిటకు చేరుతున్నాయి. వీటన్నింటిపైనా సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే జెడ్పీ సర్వసభ్య సమావేశం నేడు జరగనుంది.



- జిల్లాలో చురుగ్గా అభివృద్ధి పనులు
- రూ.కోట్ల ఖర్చుతో పంచాయతీల్లో పనులకు శ్రీకారం
- పల్లె పాలనలో మరింత పెరిగిన పారదర్శకత
- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

సాక్షి చిత్తూరు/చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అన్ని శాఖల ప్రగతిపై ప్రతి రెండు నెలలకోసారి జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అందులో భాగంగా శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సమక్షంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రధానంగా 12 అంశాలతో కూడిన ఎజెండాతోపాటు ఇతర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

అందరికీ లబ్ధి

జిల్లాలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. సచివాలయాల ద్వారా ఇంటి వద్దకు వెళ్లి వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. సచివాలయాల్లో పల్లె పాలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. పశ్చిమ మండలాలకు శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టు సర్వే పనులు సాగుతున్నాయి.

పారదర్శక పాలన



ఉమ్మడి జిల్లాలో ప్రజలకు పారదర్శక పాలన అందుతోంది. గ్రామీణులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు బాగుండాలని పథకాలను ఇస్తున్నారు. విద్య, వైద్యం, మహిళలు, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నవరత్నాలతోపాటు పేదల కల అయిన సొంత ఇంటి నివాసానికి రుణ సదుపాయం ఇస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు. ప్రజల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు.

– గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్



గ్రామ సచివాలయం

సంక్షేమం - అభివృద్ధి

గత ఆర్థిక సంవత్సరం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఉమ్మడి జిల్లాలో 4,39,167 మంది రైతుల ఖాతాలకు రూ.572.67 కోట్లు జమ చేశారు. వైఎస్సార్ సున్నావడ్డీ కింద పంటరుణాల కోసం 48,395 మంది రైతులకు రూ.62.24 కోట్లు వడ్డీ రాయితీని వారి ఖాతాలకు జమ చేశారు. పంట రుణాల కింద రూ.10,096 కోట్లు రైతులకు అందజేశారు.

- జిల్లాలో గ్రామీణ నీటి సరఫరాశాఖ కింద మంజూరైన 13,061 పనుల కోసం రూ.151 కోట్లు ఖర్చు చేశారు. జగనన్న కాలనీల ఏర్పాటులో సొంత ఇంటి కలను సాకారం చేయడంలో భాగంగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా 1,22,348 గృహాలు బేస్‌మెంట్ పరిధి దాటాయి. ఇందుకోసం రూ.1,498 కోట్లు ఖర్చు చేశారు. 15,789 నూతన వ్యవసాయ సర్వీసులకు రూ.315 కోట్ల వ్యయంతో విద్యుత్ సరఫరా చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్లు ఉచితంగా 2,28,901 మందికి అందజేయగా వాటి కోసం రూ.4.52 కోట్లు ఖర్చు చేశారు. ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద వ్యవసాయ సర్వీసులకు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు కోసం రూ.1673.6 కోట్ల పనులకు ఒప్పందం కుదిరింది.

- ఉమ్మడి జిల్లాలో వృద్ధాప్య, వితంతు, చేనేత, వికలాంగ, అభయహస్తం, కల్లుగీత, హిజ్రాలు, ఒంటరిమహిళ అన్ని రకాల కేటగిరి పింఛన్లు కలిపి 5,51,705 మందికి రూ.1646.34 కోట్లు అందజేశారు. వైఎస్సార్ చేయూత కింద మూడో విడతగా 1,99,459 మందికి రూ.373.99 కోట్లు అందజేశారు. వైఎస్సార్ ఆసరా కింద 60,440 సంఘాల పొదుపు ఖాతాలకు రూ.580.18 కోట్లు ఇచ్చారు. వైఎస్సార్ సున్నావడ్డీ కింద 68,440 స్వయం సహాయక సంఘాలకు రూ.134.05 కోట్లు అందజేశారు. జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా చిరువ్యాపారులకు 1,58,094 మందికి రూ.158.09 కోట్లు రుణం ఇచ్చారు. వడ్డీ



రాయితీ కింద 65,916 మంది లబ్ధిదారులకు రూ.1.77 కోట్లు అందజేశారు. స్త్రీ నిధిలో 82,909 మందికి రూ.350.05 కోట్లు రుణ సౌకర్యం కల్పించారు. ఎస్సీ, ఎస్టీల్లో 9,314 మందికి రూ.45.16 కోట్లు సబ్‌ప్లాన్ కింద అందజేశారు. మహిళ సంఘాలకు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే సాయం రూ.1.80 లక్షలతో పాటు అదనంగా మరో రూ.35,000 చొప్పున అందజేస్తున్నారు. అలా మొత్తం 89,346 మందికి రూ.332.30 కోట్లు అందజేశారు.



- ఆరోగ్య శ్రీ కింద 12,747మందిని చికిత్సతో ఆదుకున్నారు. 17,919 మంది మహిళలకు ప్రసవాలు చేశారు. 37,525 మందికి డయాలసిస్ సెషన్స్ నిర్వహించారు.

- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1.64 లక్షల కుటుంబాలకు 35.02 లక్షల పని దినాలు కల్పించి, రూ.89.03 కోట్లు అందజేశారు.

కొత్తగా 33 సబ్‌స్టేషన్ల నిర్మాణాలను రూ.58 కోట్లతో చేపట్టనున్నారు.

- పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో 563 గ్రామ సచివాలయాలు, 489 రైతు భరోసా కేంద్రాలు, 208 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించారు. వీటి కోసం రూ.376.26 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. పీఎంజీఎస్‌వై కింద రూ.131 కోట్ల నిధులతో 100 కిలోమీటర్లు, ఏపీఆర్‌ఆర్‌పీ కింద రూ.254 కోట్ల నిధులతో 210 కిలోమీటర్ల మేర రోడ్లను వేశారు.





- అమ్మఒడి కింద రూ.505 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద జిల్లాలోని 3,36,422 మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించారు. చిక్కీలు అందించని రోజుల్లో రాగి జావ ఇచ్చారు. డిజిటల్ విద్యలో భాగంగా 39,003 మంది విద్యార్థులు, 5,532 మంది ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. నాడు–నేడు కింద 1,533 పాఠశాలలు, 30 జూనియర్ కళాశాలల్లో రూ.778కోట్లతో ఆధునీకరణ పనులు అమల్లోకి తీసుకొచ్చారు. జగనన్న విద్యాకానుక కిట్ల కింద రూ.68.30 కోట్లతో 3,47,748 మంది విద్యార్థులకు యూనిఫాం, బెల్ట్, షూస్, సాక్స్, నోట్, టెక్స్ట్, వర్క్ బుక్స్ అందజేశారు.

ప్రతి గడపకు మహిళా పోలీస్ ప్రారంభం



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, డీఐజీ అమ్మిరెడ్డి, మేయర్ అముద, ఎస్పీ తదితరులు

చిత్తూరు అర్బన్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడానికి వారి ఇళ్ల వద్దకే వెళ్లి వివరాలు తీసుకుని.. వాటిని పరిష్కరించడానికి చేపట్టిన ప్రతి గడపకు మహిళా పోలీస్ కార్యక్రమాన్ని చిత్తూరులో కలెక్టర్ షణ్మోహన్ ప్రారంభించారు. నగరంలోని 5వ డివిజన్ సచివాలయంలో శుక్రవారం జరిగిన ప్రతి గడపకు మహిళా పోలీస్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు పోలీసుశాఖ మరింత దగ్గరగా చేరువయ్యేందుకు ఈ బృహత్తర కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యావంతులైన వార్డు, గ్రామ సచివాలయ మహిళా పోలీసు కార్యదర్శులు వివరాలను సేకరించేపుడు ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించి, వాళ్లు చెప్పే వివరాలను యాప్‌లో తప్ప మరెక్కడా వెల్లడించకుండా గోప్యత పాటించాలని సూచించారు. ఇప్పటికే ప్రజలకు చేరువైన సచివాలయ కార్యదర్శుల్లో ఈ కార్యక్రమం మరింత బాధ్యతను పెంచుతుందన్నారు.

మహిళల్లో చైతన్యం తేవాలి

అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ సర్వే చేసే ప్రతీ ఒక్క కార్యదర్శి మనసపెట్టి మహిళలతో మాట్లాడాలని, అందులోనూ మహిళలు మాట్లాడి సమస్యలు చెప్పేలా వారిలో చైతన్యం తేవాలని చెప్పారు. అపుడే ఈ కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఆశించిన ఫలితాలు ఇస్తే రాష్ట్రమంతా దీన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు.

నమ్మకం కలిగించండి

ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తూరులో ప్రతి గడపకు మహిళా పోలీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దాదాపు 500 మంది మహిళా పోలీసులు, రెండు వేల మంది వలంటీర్లు దీన్ని అంకితభావంతో పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులకంటే మహిళా పోలీస్‌కు చెబితే సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలన్నారు. పోలీసుశాఖ చేస్తున్న ఈ కార్యక్రమం నేరాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడుతుందని నగర మేయర్ అముద, కమిషనర్ డా.అరుణ అన్నారు. అనంతరం యాప్‌కు సంబంధించిన బ్రోచర్లు విడుదలచేసి, పలువురు మహిళల నుంచి వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హరిణిరెడ్డి, ఏఎస్పీలు శ్రీలక్ష్మి, సుధాకర్, డీఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, విష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్ సీఐలు భాస్కర్, మద్దయ్య ఆచారి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

90 ఏళ్ల చెత్తకు విముక్తి

పెరుగుతున్న జనాభాకు తగ్గ అవసరాలకు అనుకూలంగా ప్రతీ భవనం నుంచి రోజురోజుకూ చెత్త ఉత్పత్తి పెరుగుతోంది. ఉత్పత్తి అవుతున్న చెత్తను 90 ఏళ్లకు పైగా ఒకే చోట తీసుకొచ్చి పడేయడం వల్ల ఏకంగా 16 ఎకరాల్లో చెత్త పేరుకుపోయింది. పేరుకున్న చెత్తను అక్కడి నుంచి తీసేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ రూపొందించిన ప్రాజెక్టును ఆమోదిస్తూ.. రూ.11.50 కోట్లతో పనులు అప్పగించింది.

- రూ.11.50 కోట్లతో చిత్తూరులో లెగసీ వేస్టేజ్ ప్రాజెక్టు
- పూర్తయిన టెండర్లు.. ఈనెల లోపే పనులు ప్రారంభం



చిత్తూరు డంపింగ్‌యార్డులో పేరుకున్న చెత్త

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 90 ఏళ్ల క్రితం జనాభా వేరు. అప్పటి మౌలిక వసతులు, ప్రజల అవసరాలు పరిమితంగా ఉండేవి. ఫలితంగా అప్పటి కుగ్రామానికి ఓబనపల్లెలో డంపింగ్ యార్డు ఏర్పాటుచేసి 16 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇక అప్పటి నుంచి చిత్తూరులోని చెత్తనంతా డంపింగ్ యార్డులో వేయడం ద్వారా, ఈ 90 ఏళ్లలో చోటుచేసుకున్న పట్టణీకరణ, నగర విస్తరణ, పెరిగిన జనాభా కారణంగా 16 ఎకరాలు చెత్తతో నిండిపోయింది. దీంతో చుటుపక్కల ఉన్న నివాస ప్రాంతాల్లోని ప్రజలకు డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్గంధం, వర్షాకాలంలో ఇక్కడి నుంచి పురుగులతోపాటు కంటికి కనిపించని సూక్ష్మక్రిముల వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లు. తాజాగా నగరాల్లో పేరుకున్న చెత్తను పూర్తిస్థాయిలో ప్రాసెస్‌చేసి డంపింగ్ యార్డులను శుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. లెగసి వేస్టేజ్ ప్రాజెక్టు కింద చిత్తూరు కార్పొరేషన్‌ను ఎంపికచేయడంతో ఈ నెలలోనే పనులు ప్రారంభించనున్నారు.

ఏం చేస్తారంటే...

చిత్తూరులోని ఓబనపల్లెలో ఉన్న 16 ఎకరాల కార్పొరేషన్ డంపింగ్ యార్డులో 5 మీటర్ల ఎత్తు వరకు చెత్త పేరుకుపోయింది. దీన్ని లెక్కించిన అధికారులు 1.35 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉన్నట్లు అంచనాకు వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో టెండర్లు పిలవగా గుంటూరుకు చెందిన జ్ఞానేశ్వర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్లను దక్కించుకుంది. ఈ నెలలో పనులు ప్రారంభించనుంది. పేరుకుపోయిన చెత్తను యంత్ర పరికరాల సాయంతో చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి ఇక్కడి నుంచి దీన్ని తీసేస్తారు. ఏడాదిలోపు 16 ఎకరాల్లోని పాత చెత్త అంతా శుభ్రమైపోతుంది.

ప్రస్తుతం నగరంలో సేకరిస్తున్న చెత్తతో వర్మీ కంపోస్టు తయారుచేసే ప్రక్రియ సులభతరమవుతుంది. మురకంబట్టులో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎస్‌డబ్ల్యూఎమ్) నిర్వహణకు ఇప్పటికే 10 ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ చెత్త పేరుకోకుండా అధునాతన పద్ధతుల్లో చెత్తను ఎరువుగా మార్చేస్తారు.

నిధులు ఇలా..

ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేషన్ వాటా 67 శాతంగా కేటాయించారు. చిత్తూరు మునిసిపాలిటీ 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.6.30 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.63 కోట్లు ఇస్తోంది. కేంద్రం నుంచి రూ.2.45 కోట్లు మంజూరు చేస్తారు. మొత్తం కలిపి రూ.11.50 కోట్లు లెగసీ వేస్టేజ్ కోసం ఖర్చు చేయనున్నారు.

పర్యావరణ హితం



లెగసీ అంటే పాత చెత్తను తీసేయడం. ఈ ప్రాజెక్టు కింద చిత్తూరులోని ఓబనపల్లె డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తదిబ్బలు అన్నీ తీసేయడానికి ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఆమోదించడం సంతోషకరమైన విషయం. ఏడాది వరకు సమయం ఉన్నా, ఇంకా ముందుగానే ఇక్కడున్న చెత్తను క్లియర్ చేయడానికి ప్రయత్నిస్తాం. ఇప్పటికే డంపింగ్‌యార్డులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. భవిష్యత్తులో ఈ స్థలాన్ని విహార, విడిది కేంద్రాలుగా మార్చడానికి చూస్తున్నాం.

– డా.అరుణ జంగిటి, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

థ్యాంక్యూ సీఎం జగన్ సార్



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు



కార్వేటినగరం: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు వైద్యసిబ్బంది



పలమనేరు: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన సచివాలయ ఉద్యోగులు

చిత్తూరు రూరల్: వైద్యవిధాన పరిషత్ చట్టాన్ని రద్దు చేస్తూ ఆస్పత్రులన్నీ ఒకే డైరెక్టరేట్‌గా మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని జిల్లా వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ఈమేరకు చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ జేజేలు పలికారు. వారు మాట్లాడుతూ ఇదివరకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీతాలు ఇచ్చేవారన్నారు. ఈ చెల్లింపులో చాలా ఇబ్బందులున్నాయన్నారు. కొన్నేళ్లుగా దీనిపై పోరాటం చేసినా ఫలితం లేదని మూడేళ్ల కిందటే ఆ ఆశను వదులుకున్నామన్నారు. కానీ ప్రభుత్వం తమ ఇబ్బందులను గుర్తించి 010 పద్దు ద్వారా చెల్లించాలన్న నిర్ణయం తీసుకుందన్నారు. ఇన్నాళ్లకు మా ఆశలు నెరవేరాయని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 1230 మంది ఉద్యోగులకు ఇది తీపికబురని, సీఎంకు తాము రుణపడి ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్, సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అధికారులు వెంకట ప్రసాద్, వరలక్ష్మీ,రాణి, పూమాల, భాస్కర్, గుణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సంబరాలు

కార్వేటినగరం: ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారంటూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పాలాభిషేకం

పలమనేరు: మంత్రివర్గ నిర్ణయంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, ఔట్‌సోర్సింగ్, ఒప్పంద ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించిందని గ్రామ, వార్డు సచివాలయాల సంక్షేమ సంఘ నాయకులు మురళీనాథ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద వారు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాము రుణపడి ఉంటామని పలమనేరు ఏపీఎన్జీవోల సంఘ అధ్యక్షులు ఆనంద్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

హాజరుకావాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 12వ తేదీన పాఠశాలకు హాజరుకావాలని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని మురకంబట్టులో ఉన్న ఏపీఆర్‌ఎస్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు ఫలితాలను aps.apcfss.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

క్లుప్తంగా

తమిళనాడు బియ్యం పట్టివేత


పోలీసులు సీజ్ చేసిన లారీ

గంగవరం: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.4.95 లక్షల విలువ చేసే తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు నగరి పట్టణానికి చెందిన భాస్కర్, అమృతరాజ్ ఇద్దరూ కలిసి తమిళనాడులో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నారు. దండపల్లి క్రాస్‌లో రెవెన్యూ, పోలీసులు నిర్వహించిన దాడిలో లారీ పట్టుబడింది. లారీలో ఉన్న దాదాపు 450 బస్తాల (సుమారు 25 టన్నుల) రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆగని ఏనుగుల దాడులు


ఏనుగులు విరిచేసిన కొబ్బరి చెట్టు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులు పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున చల్లావారిపల్లెకు చెందిన రమణ మామిడి తోట కంచెను తొక్కి, లోపలికి ప్రవేశించి కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. మామిడి కొమ్మలను విరిచేయడంతో కాయలంతా నేలపాలయ్యాయి.

కాంగ్రెస్ కో ఆర్డినేట్ కమిటీ సభ్యుడి నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ చిత్తూరు అసెంబ్లీ కో ఆర్డినేట్ కమిటీ సభ్యునిగా రావూరి పూర్ణచంద్రశేఖర్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికైన పూర్ణమాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

పని చేయండి.. సాకులు చెప్పకండి

- జనన ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ మంజూరు
- సీడీపీవోలు మరింత బాధ్యతగా పనిచేయాలి
- పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : నిర్దేశించిన పనులు చేయండి.. కుంటి సాకులు చెప్పకండి అంటూ కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలను నిర్వహించారు. ఐసీడీఎస్ శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ 0–5 ఏళ్ల పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం మంజూరుతోపాటు ఆధార్ కార్డు పొందేలా సీడీపీవోలు పని చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు లబ్ధి పొందేందుకు ఆధార్ కార్డు ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమన్నారు. పుట్టిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డు ఇప్పించే బాధ్యత సీడీపీవోలదేనని చెప్పారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు దీన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బిడ్డకూ ఆధార్ కార్డు పొందేలా చేస్తే సంక్షేమ పథకాలు వారికి చేరువచేసినట్టవుతుందని చెప్పారు. జిల్లాలో వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వర్ పనిచేయలేదు, ఇతరత్రా కారణాలను చెబుతూ కొందరు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు సాకులు చెప్పడం మానుకుని విధులు నిర్వహించాలని ఆదేశించారు.

సర్వే సాగడం లేదు

ఎన్‌సీడీ, సీడీ సర్వే ఎందుకు ముందుకు సాగడం లేదని కలెక్టర్ ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా, ఏఎన్‌ఎంలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ లోపు జిల్లా వ్యాప్తంగా సర్వే 80 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య స్థితిగతులు సంపూర్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఒక హెల్త్ ఐడీని క్రియేట్ చేయాలన్నారు. ఇందుకు సంబంధించి జరుగుతున్న ఎన్‌సీడీ సీడీ సర్వేను పకడ్బందీగా చేయాలని వచ్చే శుక్రవారం నాటికి జిల్లాలో 80 శాతం సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సర్వేని నియోజకవర్గ స్థాయిలో పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్ల నియామకం చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రాజశేఖర్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు ఏఎన్‌ఎం ద్వారా వారు అందించిన వైద్య సేవలను సంబంధిత యాప్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. నాడు నేడు పనులను పకడ్బందీగా చేపట్టాలని విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రతి పాఠశాలలో ఘనంగా జగనన్న విద్యాకానుక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను కార్యక్రమానికి ఆహ్వానించాలని చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణ పురోగతి కోసం లబ్ధిదారులకు అవసరమయ్యే రుణాలను మంజూరు చేసేలా ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. అమృత్ సరోవర్ కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పని దినాలను పెంచాలని ఉపాధి పనులను ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పలు సమీక్షల్లో ఇలా......

రోడ్ల అభివృద్ధి అంశంపై రెవెన్యూ, ఎన్‌హెచ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చెన్నై–బెంగళూరు, చిత్తూరు–తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే వంటి రోడ్ల అభివృద్ధికి భూముల సేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ఆలస్యం కావడంతో కొన్ని చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. చిత్తూరు, గుడిపాల, తవణంపల్లె, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు అవసరమైన భూములను వెంటనే అందజేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. చిత్తూరు–తచ్చూరు రోడ్డుకు భూములిచ్చినవారికి నోటీసులు ఇచ్చి, డబ్బులు పంపిణీ చేయాలన్నారు. అవార్డులు పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్డీవో, తహసీల్దార్లను ఆదేశించారు. సోమ, శుక్రవారాల్లో ఏ ఒక్క తహసీల్దార్ కూడా సెలవులో వెళ్లడానికి వీలులేదని చెప్పారు. సెలవు పెట్టాలంటే కలెక్టర్, జేసీల వద్ద ముందస్తు అనుమతి తీసుకునేలా ఉత్తర్వులు జారీచేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకాలు


చౌడేపల్లె: ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో వేదపండితులతో అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

హిస్టరీ లెక్చరర్ కావాలి

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన బోధించడానికి హిస్టరీ లెక్చరర్ కావలెనని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ సబ్జెక్టులో పోస్టుగాడ్యుయేషన్‌తో పాటు యూజీసీనెట్, లేదా ఏపీసెట్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ కలిగిన వారి కి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12వ తేదీ సోమవారం కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాల ని కోరారు. ఇతర వివరాలకు 91821 36020ను సంప్రదించాలని చెప్పారు.

ప్రాచీన ఆలయం పరిశీలన


ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: మండల కేంద్రంలోని ప్రాచీన ప్రసన్న వేంకటేశ్వర ఆలయాన్ని శుక్రవారం టీటీడీ అధికారులు పరిశీలించారు. గతంలో గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించాలని మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడి ఆలయ నిర్మాణానికి 1.7 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు అధికారులు పరిశీలించి నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నట్లు వివరించారు.

రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఉమామహేశ్వరి


ప్రొఫెసర్ పి.ఉమా మహేశ్వరి

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగపు ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. మహిళా వర్సిటీలో వివిధ హోదాల్లో ఆమె పనిచేశారు. ఆమె నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైభవం.. పుష్పయాగం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని తుమ్మూరు వద్ద వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం రాత్రి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ముందుగా పుష్పయాగం కోసం తీసుకొచ్చిన సుగంధ సుమాలను బుట్టల్లో నింపి ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో ప్రదక్షిణ చేశారు. అనంతరం కనులపండువగా పుష్పయాగం జరిపించారు. ఆలయ ప్రధానార్చకుడు శేషాద్రిస్వామి, టీటీడీకి చెందిన వేదపండితులు శాస్త్రోక్తంగా యాగం నిర్వహించారు.

ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- మోడల్ స్కూల్స్ ఆదర్శంగా ఉండాలి
- సమావేశంలో డీఈవో విజయేంద్రరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో నిర్వహించే 6వ తరగతి ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో విజయేంద్రరావు ఆదేశించారు. డీఈవో కార్యాలయంలో శుక్రవారం మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్ష నిర్వహించే కేంద్రాల్లో విద్యార్థులను అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాల్లో 751 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే ముందు విద్యార్థులకు ఓఎంఆర్ షీట్లపై ఇన్విజిలేటర్లు అవగాహన కల్పించాలని చెప్పారు. సెల్‌ఫోన్‌లు వినియోగించకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్స్ ఆదర్శంగా ఉండేలా ప్రిన్సిపల్స్ చర్యలు చేపట్టాలన్నారు. మోడల్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలు రాయాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో టీచింగ్, లెర్నింగ్ లెవల్స్ తగ్గకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రిన్సిపల్స్ పర్యవేక్షణతోపాటు, పాఠాలు బోధించాలని చెప్పారు. మోడల్ స్కూల్స్‌లో చదివే విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత చెందకపోవడానికి గల కారణాలపై సమీక్ష చేశారు. రానున్న విద్యాసంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌తోపాటు ఇతర విద్యార్థులు చదువులో రాణించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, క్లర్క్ మధు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం మహంతుపై వేటు

– సస్పెండ్ చేసిన దేవదాయశాఖ

తిరుపతి రూరల్: హథీరాంజీ మఠం ఆస్తుల దుర్వినియోగం, మఠం నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం, రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం వంటి కారణాల వల్ల మఠం మహంతు అర్జున్‌దాస్‌పై వేటు పడింది. ఆయన్ని సస్పెండ్ చేస్తూ దేవదాయశాఖ ధార్మికపరిషత్ తీర్మానించింది. ఆ మేరకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. అయితే సస్పెన్షన్ ఉత్తర్వులను తీసుకునేందుకు అర్జున్‌దాస్ అందుబాటులోకి రాలేదు. రెండు రోజులుగా ఎదురుచూస్తున్న ఎండోమెంట్ అధికారులు చివరకు రెవెన్యూ అధికారులను కలిశారు. మండల మెజిస్ట్రేట్ అయిన తిరుపతి అర్బన్ తహసీల్దార్ ఆధ్వర్యంలో ఎండోమెంట్ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జీవన్ కుమార్, దేవదాయశాఖ తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయర్ రమేష్‌బాబు, వీఆర్వో కలిసి శుక్రవారం తిరుపతిలోని హథీరాంజీమఠం కార్యాలయానికి వెళ్లారు. సస్పెన్షన్ ఉత్తర్వులను ఇచ్చేందుకు ప్రయత్నించగా.. అర్జున్‌దాస్ అందుబాటులోకి రాకపోవడంతో పంచనామా నిర్వహించారు. ఉత్తర్వులను కార్యాలయ గేటు, అర్జునదాస్ నివాసానికి అంటించారు.

ఫిట్ పర్సన్‌గా విజయసారథి!

హథీరాంజీమఠం మహంతుగా ప్రస్తుత పరిపాలన వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఏపీఐఐసీలో ల్యాండ్ విభాగం ఓఎస్‌డీగా ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయసారధిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

నిరంతర శ్రమతోనే విజయం


విద్యార్థులతో హాకీ క్రీడాకారిణి రజని తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం శ్రమిస్తే విజయం సొంతమవుతుందని అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజని తెలిపారు. శుక్రవారం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్, ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన 'ఇంటరాక్షన్ విత్ రజని' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరాజయంతో కుంగిపోకుండా విజయంకోసం మొక్కవోని దీక్షతో కృషి చేయాలని సూచించారు. అనేక పరాజయాలు ఎదుర్కొన్న తర్వాతే నేడు అంతర్జాతీయ క్రీడాకారిణిగా మీ ముందున్నానని, శ్రీవారి దయతోనే ఈ స్థాయిని అందుకోగలిగానని తెలిపారు. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వెనుకంజ వేయకుండా లక్ష్య సాధన దిశగా ముందుకుసాగాలని కోరారు. ముఖ్యంగా మహిళలు అత్యంత ధైర్యంగా సమస్యలను ఎదిరించాలని వెల్లడించారు. కార్యక్రమంలో టీటీడీ డీఈఓ డాక్టర్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ నారాయణమ్మ, డాక్టర్ భువనేశ్వరి, పీడీ డాక్టర్ మస్తాక్ అహ్మద్, అధ్యాపకులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ భీమన్న, కిరణ్ కుమార్, రామకృష్ణారెడ్డి, విజయశ్రీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి తీవ్రగాయాలు


గాయపడిన శ్రీనివాసులు

విజయపురం (నగరి) : టిప్పర్ లారీ ఢీకొని ఉపాధి కూలీ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం జగన్నాథపురంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు, గ్రామానికి చెందిన కన్నయ్య, శ్రీనివాసులు (62) జగన్నాథపురం అడవిలో ఉపాధి పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో అడవిలో నుంచి గ్రావెల్ తీసుకొస్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. దీంతో శ్రీనివాసులు కాలు నుజ్జు నుజ్జయ్యింది. వెంటనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి ఎస్ఐ నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో మహనీయుల విగ్రహాలు


వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ శేఖర్, ఈఓ వెంకటేశు

రేణిగుంట : మండలంలోని కరకంబాడి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద, బీఆర్ అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలామ్ విగ్రహాలను డీఈఓ శేఖర్, కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు శుక్రవారం ఆవిష్కరించారు. ఈఓ మాట్లాడుతూ సంఘ సంస్కర్తల కృషితోనే భారతావని సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన దేశంగా అవతరించిందని తెలిపారు. డీఈఓ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపవచ్చన్నారు. అనంతరం యోగా, ధ్యాన్య కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. బాల్యవివాహాల నిర్మూలనలపై ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ రూపొందించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు రఘురాం, నారాయణస్వామి, పరమశివన్, సేవ్ నర్సింగ్ కళాశాల కరెస్పాండెంట్ ప్రవీణ్, టీటీడీ ఈఈ మనోహరం పాల్గొన్నారు.